క్లుప్తంగా

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు



అర్చకులతో నీలం మధు

పటాన్‌చెరు టౌన్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. మూడోసారి ప్రభుత్వం అధికారంలోకి రావాలని భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరుగులేని ఆధిక్యత సాధించి మూడోసారి కూడా అధికారం రావాలని శ్రీరాముడిని కోరుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

సెల్ఫ్ రిపోర్ట్ చేయకుంటే సీటును కోల్పోతారు

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్

పటాన్‌చెరు: కళాశాలలో సెల్ఫ్ రిపోర్ట్ చేయకుంటే సీటును కోల్పోతారని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి గాను మొదటి సంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీ లైఫ్ సైన్స్ అండ్ బీఎస్సీ ఫిజికల్ సైన్స్ మొదటి విడతలో సీట్లు పొందిన విద్యార్థులు 25వ తేదీలోపు సెల్ఫ్ రిపోర్ట్ చేయాలని, రిపోర్టింగ్ చేయని విద్యార్థులు తమ సీటును కోల్పోతారన్నారు. రెండో విడతలో దోస్త్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌కు 26వ తేదీ చివరి గడువు అని, వెబ్ ఆప్షన్ గడువు 27వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. మరింత సమాచారానికి కళాశాలలో హెల్ప్ లైన్ సెంటర్‌లో హిందీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పూనంను సంప్రదించాలని సూచించారు.

హెల్మెట్ ధరించకుంటే జరిమానా



పోలీసులకు హెల్మెట్ పెడుతున్న డీఎస్పీ రఘు

జహీరాబాద్ టౌన్: హెల్మెట్ ధరించకుంటే జరిమానా విధిస్తామని జహీరాబాద్ డీఎస్పీ రఘు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసుల ఆధ్వర్యంలో శనివారం హెల్మెట్ రైడ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హెల్మెంట్ ధరించకపోవడంతో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని విచారం వ్యక్తం చేశారు. వాహనదారులు హెల్మెట్ ధరించని పక్షంలో ఎంవీఐ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు పోలీస్‌స్టేషన్ నుంచి పస్తాపూర్ చౌరస్తా వరకు భారీ మోటారు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసులు, యువకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఓ ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు హెల్మెట్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జహీరాబాద్ టౌన్ సీఐ భూపతి, ఎస్ఐలు శ్రీకాంత్, కాశీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలి



యూనిఫాం విక్రయ గదిని సీజ్ చేస్తున్న ఎంఈఓ కృష్ణ

వట్‌పల్లి(అందోల్): జోగిపేటలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో అధిక ఫీజులు, యూనిఫాం, బుక్స్ పేరుతో వ్యాపారం చేస్తున్నారని డిమాండ్ చేస్తూ శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అధిక ఫీజులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ డీఈఓ వెంకటేశ్వర్లకు సమాచారం అందించారు. దీంతో డీఈఓ వెంటనే ఎంఈఓ కృష్ణను ఆదేశించగా అక్కడికి వెళ్లిన ఎంఈఓ అక్కడి పరిస్థితిపై ఆరా తీసి యూనిఫాం, బుక్స్ విక్రయించే గదికి తాళం వేసి సీజ్ చేశాడు. సీజ్ చేసే సమయంలో పాఠశాలలో పనిచేస్తున్న వేణు అనే వ్యక్తి ఎందుకు సీజ్ చేస్తున్నావు.. అన్ని ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేసి బుక్స్, యూనిఫాం అమ్మకుండా చర్యలు తీసుకోవాలని తనపై దురుసుగా ప్రవర్తించినట్లు ఎంఈఓ తెలిపారు. దీంతో వేణుపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎర్రొళ్ల మహేష్, సభ్యులు వంశీ, మైపాల్, రేణుకుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పశువులను మింగేస్తున్న పాలిథిన్

- చెత్త, ఆహార వ్యర్థాలు తిని మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- మానవాళికీ చేటంటున్న నిపుణులు

హత్నూర(సంగారెడ్డి): పాలిథిన్ (ప్లాస్టిక్) భూతం ప్రపంచాన్ని పట్టిపీడిస్తోంది. ఇది మనుషులకే కాదు, పశువులకు కూడా ప్రాణాంతకంగా మారింది. మనుషులు ఉపయోగించే ప్లాస్టిక్ కవర్లను చెత్తలో పారేయడంతో వాటిని పశువులు తింటున్నాయి. అవి వాటి కడుపులో అరగవు.ఈ కారణంగా మూగజీవాలు రోగాల పాలవుతున్నాయి. ఒక్కో సమయంలో ప్రాణాలు కూడా కోల్పోతున్నాయి. ప్లాస్టిక్ నివారణా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా జాగ్రత్త పడకుంటే మానవాళికి ముప్పు తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో రోజురోజుకూ ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోయింది. జిల్లాలో గ్రామాలు, పట్టణాలలో విరివిగా ప్రజలు పాలిథీన్ కవర్లను ఎక్కువగా వాడుతున్నారు. దీంతో పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి ప్రాణాంతకంగా మారుతోంది. పశువులు పాలిథీన్ కవర్లను తిని మృత్యువాత పడుతున్న సంఘటనలు జిల్లాలో కోకొల్లలుగా ఉన్నాయి. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనారోగ్య సమస్యలపై అవగాహన పెరుగుతున్నా ఆచరణలో మాత్రం క్షేత్రస్థాయిలో అమలుకావడం లేదు. ప్రభుత్వం 20 మైక్రాన్ల ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు నిషేధించింది. అధికారుల పర్యవేక్షణ లేక ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు అమ్మకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ప్లాస్టిక్ వినియోగించి బయట ప్రదేశాల్లో పడడంతో పశువులు తిని మృత్యువాత పడుతున్నాయి.

పశువులను బయటకు వదలొద్దు

పశుపోషకులు పశువులను బయటకు వదిలేసేసిన తర్వాత గడ్డి దొరకక్క ఆహార వ్యర్థాలు. పాలిథిన్ కవర్లలో వేసి ప్రజలు బయట పడేస్తుంటారు.



ప్లాస్టిక్ కవర్లను తింటున్న పశువులు

ఇలాంటి వాటిని పశువులు తింటున్నాయి. ఇవి కడుపులో పేరుకుపోయి వ్యాధులబారిన పశువులు పడుతున్నాయి. ఆ తర్వాత గడ్డి తిన్నప్పటికీ అది కూడా అరగని పరిస్థితులు నెలకొంటున్నాయి.

ప్రమాదకరంగా కవర్ల వినియోగం

పశువులు ఆహార వ్యర్థాలతో కలిసిన ప్లాస్టిక్ సంచులు, చెత్తలో పడేసే చెత్తతోపాటు సీటు కవర్లను తినేస్తున్నాయి. అవి పశువుల జీర్ణ వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తున్నాయి. వాటి పొట్ట ఉబ్బి రకరకాల జబ్బులకు కారణమవుతాయి. ప్లాస్టిక్ నుంచి వెలువడే డీఈ హెచ్పీ తదితర ప్రాణాంతక రసాయనాలు, పశువులు పునరావృత్తి వ్యవస్థను దెబ్బతియడమే కాకుండా మూత్రపిండాలు, కాలేయం సంబంధిత వ్యాధులు పశువులకు సోకే ప్రమాదముంది. అంతే కాదు ఆపరేషన్ చేసి కడుపులో పేరుకుపోయిన ప్లాస్టిక్ సంచుల్ని బయటకు తియాల్సి ఉంటుంది. లేదంటే చనిపోయే ప్రమాదముంది. ఇలాంటి పరిస్థితులను గమనిస్తే పశుపోషకులు వెంటనే పశువైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లి వైద్యం అందించాల్సి ఉంటుంది.

❝ ప్లాస్టిక్ వస్తువులను తినకుండా చూడాలి



పశువులు, మూగజీవాలు పాలిథీన్ కవర్లను తినకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. పట్టణ ప్రాంతాల్లో చాలా వరకు పశువులు పాలిథీన్ కవర్లలో పెట్టి పడేసే వ్యర్థాలను తినే సమయంలో ప్లాస్టిక్ ను తింటున్నాయి. ఇలాంటి ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను తినడం కారణంగా పశువుల కడుపులో అరగంట సమయంలో ఉండలుగా తయారై బయటకు రావు. రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంది. ప్రమాదకర పరిస్థితుల్లో పశువులు చనిపోతుంటాయి. అలాంటి వాటి పాలు తాగినా ప్రమాదమే.

– సంధ్యారాణి, మండల పశువైద్యాధికారి

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి

- వ్యవసాయ అధికారి లావణ్య
- సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

నాల్కల్(జహీరాబాద్): అర్హులైన రైతులు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్య తెలిపారు. శనివారం ఎంపీపీ సమావేశ మందిరంలో మండల అధ్యక్షురాలు అంజమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలో 19.940 మంది రైతులు ఉన్నారని, ఇప్పటివరకు 18,725 మంది రైతులు తగిన ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్టు తెలిపారు. కొత్త రకం విత్తనాలు రైతులు సాగు చేసుకోవాలని సూచించారు. వైస్ ఎంపీపీ గౌసొద్దీన్, సర్పంచ్ కుత్బొద్దీన్ ప్రభుత్వ పథకాలకు సంబంధించి సమాచారం ఇవ్వడం లేదన్నారు. అనంతరం తహసీల్దార్ మునిరొద్దీన్ మాట్లాడుతూ ఇప్పటివరకు 162 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అందజేశామన్నారు. విద్యుత్‌శాఖ ఏఈ అర్జున్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి పశువులు మృతి చెందితే రూ.30వేలు పరిహారం ఇస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు వేసి చాలా రోజులైనా నేటికీ విద్యుత్‌తీగలు ఎందుకు అమర్చడంలేదని సభ్యులు అమీర్, మల్‌రెడ్డి, కుత్బొద్దీన్ ప్రశ్నించగా సమస్యను పరిష్కారానికి కృషి చేస్తానని ఏఈ హామీనిచ్చారు. ఎంఈఓ మారుతి రాథోడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 5845 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు వచ్చాయని, మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలలను ఎంపిక చేయగా అందులో కొన్నింటిని ప్రారంభించినట్టు వివరించారు. ఏపీఓ రంగారావు మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లో మొక్కలు నాటాలని కోరారు. చేపట్టిన పనులకు సరిపడ డబ్బులు రావడంలేదని మిర్జాపూర్(ఎన్), టీకూర్ సర్పంచ్‌లు మల్‌రెడ్డి, ఆమీర్ వాపోయారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి లావణ్య

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ బాలయ్య

వట్‌పల్లి(అందోల్): గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీపీ జోగు బాలయ్య అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 21రోజుల పాటు నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పంచాయితీ రాజ్ ఏఈ మొగులయ్య మాట్లాడుతూ మండలంలో 135 సీసీ రోడ్లు మంజూరు కాగా 125 రోడ్ల నిర్మాణం పూర్తి చేసినట్టు తెలిపారు. 40 కమ్యూనిటీ భవనాలు మంజూరైతే వాటిలో 9 నిర్మాణాలు మాత్రమే పూర్తిచేసినట్టు, మిగతా నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దారు మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ ధరణి విషయంలో మండల స్థాయిలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. కొత్త పట్టా పాసుపుస్తకాలు పొందినవారు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ విజయరత్న సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ రమేశ్, ఎంపీడీఓ సత్యనారాయణ ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ బాలయ్య

ఆలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం



మాట్లాడుతున్న మధుసుదన్‌రెడ్డి

పటాన్‌చెరు: ఆలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గూడెం మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రుద్రారం గ్రామ పరిధిలోని మల్లికార్జున నగర్‌లో పోచమ్మ తల్లి ఆలయం పనులకు శనివారం స్థానిక సర్పంచ్ సుధీర్‌రెడ్డి, ఎంపీటీసీ రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాండుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నాయకత్వంలోనియోజకవర్గంలో 170కి పైగా దేవాలయాలు నిర్మించినట్టు వివరించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు నర్సింహా, నాయకులు శివయోగెందర్‌గౌడ్, నాగరాజు, అరుణ్ పాల్గొన్నారు.

వృత్తిదారుల వివరాలను సేకరించాలి

మునిపల్లి(అందోల్): కుల వృత్తిదారులు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల గ్రామాలకు వెళ్లి వృత్తి పని చేస్తున్నది లేనిది పరిశీలించి వివరాలు సేకరించాలని ఎంపీడీఓ హరినందన్‌రావు అన్నారు. శనివారం ఎంపీపీ సమావేశ మందిరంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కుల వృత్తిదారులు తమకు రుణాలు మంజూరు చేయాలని ఆన్‌లైన్‌లో 716 మంది దరఖాస్తు చేసుకోగా 481 మందికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన ఫారాలను అందజేసినట్టు తెలిపారు.

పేదరికం చదువుకు అడ్డు కావొద్దు

సదాశివపేట (సంగారెడ్డి): పేదరికం చదువుకు అడ్డు కాకూడదని ఎంఈఓ దండు అంజయ్య అన్నారు. శనివారం పట్టణంలోని శివపురి కాలనీకి చెందిన సోన్నాయిల మనిషా(13) తండ్రి నర్సయ్య 10ఏళ్ల చనిపోవడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో మనీషా చదువు మానేసి తల్లితో పాటు ఇళ్లల్లో పనిచేయడానికి వెళ్తుందని నాగులపల్లి సర్పంచ్ నాగేష్ ఎంఈఓకు వివరించారు. దీంతో స్పందించిన ఎంఈఓ అంజయ్య మనీషా ఇంటికి వెళ్లి తల్లి నర్సమ్మతో బాలిక చదువు విషయంపై మాట్లాడటంతో చదివించడానికి అంగీకరించింది. దీంతో సదాశివపేటలోని కస్తూర్బా పాఠశాలలో 7వ తరగతిలో ఆంగ్ల మాధ్యమంలో చేర్పించినట్టు ఎంఈఓ అంజయ్య తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ లలిత, సర్పంచ్ నాగేష్, సీఆర్పీ రాజేశ్వర్ సీఆర్పీలు పాల్గొన్నారు.



మనీషాను పాఠశాలలో చేర్పిస్తున్న ఎంఈఓ అంజయ్య

నేత్రపర్వం.. జగన్నాథ రథయాత్ర



సంగారెడ్డి అర్బన్: రథాన్ని లాగుతున్న భక్తులు



రామచంద్రాపురంలో..

సంగారెడ్డి అర్బన్: పట్టణంలోని భక్తి యోగా కేంద్రం ఆధ్వర్యంలో శనివారం జగన్నాథ రథయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. రథయాత్రను సంగారెడ్డి కొత్త బస్టాండ్ నుంచి ఐటీఐ, కలెక్టర్ కార్యాలయం మీదుగా పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు కోలాటాలు ఆడుతూ.. పాటలు పాడుతూ యాత్ర కొనసాగించారు. రథయాత్రలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేశ్వరరావు దేశ్‌పాండే, పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేశ్‌పాండేను ఇస్కాన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ కేంద్రంలో శనివారం తెల్లాపూర్ నైబర్ హూడ్ అసోసియేషన్, ఇస్కాన్ సంయుక్త ఆధ్వర్యంలో భక్తులు పూరి జగన్నాథ రథయాత్రను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు శ్రీకాంత్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, తెల్లాపూర్ నైబర్‌హూడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే



గుంతలమయంగా రోడ్డు

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి పట్టణంలోని 13వ వార్డులోని గీతానగర్ కాలనీలోని డీటీసీబీ లేఔట్‌లోని ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారి చిత్తడిగా మారింది. దీంతో రామాంజనేయ కాలనీ, మైత్రినగర్, చత్రపతి కాలనీలకు చెందిన కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు.

బస్సును పునరుద్ధరించాలి

నారాయణఖేడ్: విద్యార్థులు, పాఠశాల, కళాశాలలకు రాకపోకలకు సంబంధించి కంగ్టి మండలం తడ్కల్ ముర్కుంజాల్, గాంధీనగర్, జంగి తదితర గ్రామాలకు బస్సును పునరుద్ధరించాలని మండల తెలంగాణ జాగృతి అధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌కుమార్, నాయకులు రాజుపటేల్ అన్నారు. ఈ మేరకు శనివారం నారాయణఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో ఆయా గ్రామాలకు బస్సులు కొనసాగేవని, ఆ తర్వాత వాటిని నిలిపివేయడంతో అనేకమంది పేద విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారని డీఎంకు వివరించగా సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.



ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ **ముగిసిన ఎన్‌సీసీ క్యాంప్**

హత్నూర (సంగారెడ్డి): మండలంలోని తురకల ఖానాపూర్ గ్రామ శివారులోని రత్నపురి విద్యాలయంలో 10 రోజులుగా నిర్వహించిన ఎన్‌సీసీ విద్యార్థుల క్యాంప్ శనివారంతో ముగిసింది. క్యాంపులో విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు యోగా, ఆర్మీ తరహాలో శిక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు ఎన్‌సీసీ అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **మెనూ ప్రకారం భోజనం అందించాలి**



ఝరాసంగం(జహీరాబాద్): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల విద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఝరాసంగంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంట గది, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాల ఆవరణతో పాటు వంటగదిని పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ నిర్మల, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **సీఎం కేసీఆర్ గొప్ప దార్శనికుడు**

సంగారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో బీసీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు బీరయ్య యాదవ్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. ఒకప్పుడు 200 రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి 1200లకు పెంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల విద్యార్థుల విద్యా అభివృద్ధికి కృషి చేసిన సీఎం కేసీఆర్ గొప్ప దార్శనికుడు అని కొనియాడారు.

◆ **క్రీడాకారులను ప్రోత్సహించాలి**

పటాన్‌చెరు టౌన్:క్రీడాకారులను ప్రోత్సహించాలని కార్పొరేటర్ కుమార్ యాదవ్ అన్నారు. జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ విభాగంలో పనిచేస్తున్న శ్రీనివాస్ కుమారుడు హన్మంత్ కుమార్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. దీంతో హన్మంత్ కుమార్‌ను కార్పొరేటర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల జూలై 1వ తేదీన హర్యానాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి వెళ్లనున్న హన్మంత్ కుమార్‌కు ప్రయాణ ఖర్చులకు సాయం చేస్తానని హామీ ఇచ్చారు.

◆ **పనుల్లో నాణ్యత పాటించాలి**

పటాన్‌చెరు టౌన్: డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. శనివారం డివిజన్‌లోని గొల్లబస్తిలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సీసీ రోడ్లు, మ్యాన్ హోల్స్ తదితర సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

◆ **నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం**

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ, చాంద్‌ఖాన్‌పల్లి, వెంకటపూర్, జూకల్‌లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణఖేడ్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మరమ్మతు పనులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.

◆ **దరఖాస్తుల పరిశీలన**

జిన్నారం(పటాన్‌చెరు): బీసీలకు ప్రభుత్వం అందించే ప్రత్యేక లోన్‌ల కోసం వచ్చిన దరఖాస్తులను శనివారం ఎంపీడీఓ, ఎంపీఓ, సూపరింటెండెంట్ కలిసి మూడు బృందాలుగా ఏర్పడి దరఖాస్తులను పరిశీలించారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ లోపు పూర్తి నివేదికను జిల్లా అధికారులకు పంపుతామని ఎంపీడీఓ రాములు తెలిపారు. దరఖాస్తుదారులు వారి ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు. మండల వ్యాప్తంగా 537 దరఖాస్తులు వచ్చినట్టు ఎంపీడీఓ పేర్కొన్నారు.

◆ **బార్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి**

సంగారెడ్డి టౌన్: రాష్ట్ర బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా సంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శిగా కృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు న్యాయవాదులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

◆ **కౌశిక్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం**



జిన్నారం(పటాన్‌చెరు): ముదిరాజ్‌లపై ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం ముదిరాజ్ సంఘం నాయకులు జిన్నారంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ముదిరాజ్‌లపై చేసిన వ్యాఖ్యలను కౌశిక్‌రెడ్డి వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు.

◆ **బహిరంగ సభను జయప్రదం చేయాలి**

సంగారెడ్డి టౌన్ : పేదల ఇళ్ల స్థలాల సాధనకు ఈనెల 25వ తేదీన సంగారెడ్డి పట్టణంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాటవేదిక ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య భవన్‌లో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం సంగారెడ్డి ఏరియా కార్యదర్శి యాదగిరి మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంలోనూ, ఇళ్లు కట్టించడంలోనూ విఫలమయ్యాయని విమర్శించారు. పేదల ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గృహలక్ష్మి పథకం కింద రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలకు జూలై 3వ తేదీన కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. 58 జీఓ ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. నాయకులు మణి, విజయరాణి, సుజాత, రాజా, సురేందర్ పాల్గొన్నారు.

◆ **సమస్యల పరిష్కారానికి కృషి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్పనగేష్ అన్నారు. శనివారం శ్రీనివాస్‌నగర్ కాలనీలోని 6వ బ్లాక్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను అధికారులతో కలసి పరిశీలించారు.

◆ **ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

జిన్నారం(పటాన్‌చెరు): వర్షాలు కురుస్తున్న సందర్భంగా శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ప్రజలు నివాసం ఉండవద్దని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లకు నోటీసులు ఇస్తున్నామని బొల్లారం మున్సిపల్ మేనేజర్ నిర్మల తెలిపారు. వర్షం కారణంగా కూలిన ఇళ్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ ఏఈ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

◆ **కరపత్రాల పంపిణీ**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గడపగడపకు వెళ్లి వివరిస్తున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని సాయినగర్‌కాలనీలో కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి బలరాం, నాయకులు ప్రవీణ్, భూపాల్‌రెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

◆ **ఆర్థిక సాయం**

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని పోచమ్మ బస్తీకి చెందిన గొల్లు అనే వ్యక్తి కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో చికిత్స నిమిత్తం స్థానిక బీజేపీ నాయకుడు ఆనంద్‌కృష్ణారెడ్డి శనివారం రూ.10వేలను అందజేశారు. ఈ సందర్భంగా గొల్లు కుటుంబ సభ్యులు ఆనంద్ కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపార

◆ **నేడు డయల్ యువర్ డీఎం**

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ఆర్టీసీ డిపోలో ఆదివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్టు మేనేజర్ రజని కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. మెరుగైన రవాణా సేవలను అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రజలు సూచనలు, సలహాలను అందించడానికి 9154298656 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

◆ **ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ల ప్రారంభం**

వట్‌పల్లి(అందోల్): జోగిపేటలోని నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అడవిరాజు, కోఆర్డినేటర్ గోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ పొందుటకు ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నికల్ వాటిలో ఏదైనా ఒక అర్హతను తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. అడ్మిషన్లు పొందుటకు వచ్చే నెల జులై 31 చివరి తేదీ అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7382929780, 9494875790 సెల్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

◆ **సీఎం రాకతో నూతనోత్సాహం**

జిన్నారం(పటాన్‌చెరు): సీఎం రాకతో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం నెలకొందని జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిన్నారం, గుమ్మడిదల మండలాల నుంచి భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారన్నారు. సీఎం సభను విజయవంతం చేయటంలో భాగస్వాములైన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు చెప్పారు.